క్లుప్తంగా

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు



వల్లూరులో జేసీబీ సాయంతో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. కపిలేశ్వరపురంలో పంచాయతీ కార్యదర్శి శివ చక్రవర్తి పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. డ్రెయిన్లను శుభ్రం చేశారు. వల్లూరు రహదారి పక్కన డంప్ చేసిన చెత్తను తరలించి పారిశుధ్య పరిరక్షణ చర్యలు చేపట్టారు. ఎంపీడీఓ కొండలరావు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలను చేపట్టామన్నారు.

రేపు మహాలక్ష్మమ్మ జాతర

రాయవరం: స్థానికంగా కొలువైన మహాలక్ష్మి అమ్మవారి జాతరను ఈ నెల 4వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. కొంగు బంగారంగా భక్తుల పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారి జాతరను ఏళ్ల తరబడి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా అమ్మవారి జాతరను గురువారం రాత్రి నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నారు.

6న రామచంద్రపురం మండల సమావేశం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 6న శనివారం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎక్స్ అఫీషియో హోదాలో తొలిసారిగా హాజరవుతున్నారని తెలిపారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, అందరు మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



యూటీఎఫ్ మండల శాఖ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ముద్రించిన యూటీఎఫ్ మండల శాఖ డైరీని మంగళవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ జయ ప్రకాశ్, జిల్లా అకడమిక్ కమిటీ కన్వీనర్ సాపే శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు భాను ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేశ్, రవికుమార్, సత్యనారాయణ, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సిద్ధూ

రామచంద్రపురం: పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బి.సిద్ధూ ఎన్నికైనట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో జూన్ 29న జరిగిన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో తనను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. కాగా సిద్ధూ డివిజన్ అధ్యక్షుడిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ విద్యార్థులు, కార్మికులు, రైతులు, దళితులు, మహిళలు, దివ్యాంగుల హక్కుల కోసం కృషి చేశారు. సిద్ధూ ఎన్నికపై ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు వి.భీమశంకరం, ఐఎఫ్‌టీయూ చింతా రాజారెడ్డి, పీవైఎల్ నాయకులు ఎ.కృష్ణ, పీడీఎస్‌యూ రామచంద్రపురం డివిజన్ నాయకులు సాయి చరణ్ తదితరులు సిద్ధూకు అభినందనలు తెలియజేశారు.

తల్లి పేరిట మొక్క నాటిన 'కోన'

మండపేట: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ తన తల్లి పేరిట మొక్క నాటారు. బురుగుంట చెరువు వైఎస్సార్ పార్కులో మంగళవారం తన మాతృమూర్తి చిత్రపటం ఏర్పాటు చేసి బీజేపీ కార్యకర్తలతో కలిసి మొక్క నాటారు. ప్రధాని మోదీ పిలుపుతో దేశమంతటా తల్లి పేరిట మొక్కలను నాటారని అందులో భాగంగా మండపేటలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కోన తెలిపారు.

పొంచి ఉన్న ముప్పు

- వ్యాధులతో జాగ్రత్తలు తప్పనిసరి
- అధికారులు దృష్టి సారిస్తే నరి



పెద్ద మార్కెట్ వీధిలో డ్రైన్లు పూడుకుపోవడంతో ఇళ్ల పరిసరాలకు చేరిన మురుగునీరు (ఫైల్)

రామచంద్రపురం: ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగిందని సంతోషిస్తున్న సమయంలో వర్షాకాలం వస్తుందంటే సీజనల్ వ్యాధులపై ప్రజలు ఇప్పటి నుంచే బెంబేలెత్తిపోతున్నారు. డ్రైన్లలో మురుగు నీరు, ఎక్కడ పడితే అక్కడే ఉంటున్న చెత్తా చెదారంతో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు ఇప్పటి నుంచి దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వానాకాలం సీజన్ ఆరంభం. పట్టణ, శివార్లు, గ్రామాల్లో అపరిశుభ్ర పరిసరాలతో పాటు అక్కడక్కడా వాన నీటి నిల్వలతో దోమలు విజృంభిస్తున్నాయి. వానాకాలం కావటంతో అప్పుడే వ్యాధులు విజృంభణ మొదలైంది. రొంప, దగ్గు, జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తుగా అప్రమత్తం కావాలి.

ఏరియా ఆసుపత్రిలో పెరుగుతున్న ఓపీ

సాధారణంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో 300 నుంచి 350 వరకు రోజూ అవుట్ పేషెంట్లు వస్తుంటారు. కానీ వర్షాకాలం సీజన్‌తో వైరల్ ఫీవర్, సాధారణ జ్వరం, దగ్గు రొంప బారిన పడుతున్న వారు పెరుగుతున్నారు. గత వారం రోజులుగా ఆసుపత్రిలో 400 నుంచి 450 వరకు ఓపీ పెరిగింది. డయేరియా కేసులు కూడా 4 నమోదయ్యాయి. డయేరియా అదుపు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ పటిష్ట చర్యలు తీసుకుంది. కాగా మరో మూడు నెలల పాటు వర్షకాలం ఉండటంతో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ అధికారులు సూచిస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

పారిశుధ్యం పనుల్లో ప్రక్షాళన అవసరం

నియోజకవర్గంలోని మున్సిపాలిటీతో పాటుగా మండల గ్రామాల్లో చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంటుంది. దీంతో గ్రామాల్లో ఉన్న మురుగునీరు నిలిచిపోయి రోడ్ల మీదుకు వస్తుంది. మురుగునీరు నిలిచిపోవటంతో దోమలు పెరిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పారిశుధ్యం నిర్వహణకు పంచాయతీల్లో లక్షలు వెచ్చిస్తున్న ప్రయోజనం మాత్రం శూన్యంగానే కనిపిస్తుంది. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటుందని పుర ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ఉంటున్న చెత్త వద్ద పందుల విజృంభణతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి ప్రతి గ్రామంలోనూ ఉందని తెలుస్తుంది. మురుగుకాలవల్లో పూడిక పోవటంతో వర్షపు నీటితో పాటుగా మురుగునీరు ఇళ్ల వరకు చేరుతుంది. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

విజృంభిస్తున్న దోమలు

వర్షాకాలం ప్రారంభం కావటంతో దోమల ఉధృతి కూడా పెరిగింది. సాయంత్రం అయితే బయట నిలబడలేని పరిస్థితి. కరెంటు పోతే ప్రజలు రాత్రి వేళల్లో నరకం చూస్తున్నారు. దోమల నివారణకు పట్టణంలో ప్రతి నెలా రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ నెలకొంది. దోమల బారి నుంచి రక్షించుకునేందుకు నియోజకవర్గంలోని గ్రామాలతో పాటుగా మున్సిపాలిటీలో ఈ వర్షాకాలం నాలుగు నెలల పాటు నెలకు సుమారుగా రూ.25 నుంచి 30 లక్షల వరకు దోమల చక్రాలు, లిక్విడ్లకు వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది.

మూడు నెలలపాటు జాగ్రత్తలు అవసరం

రానున్న నాలుగు నెలల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా జూన్ మూడో వారం నుంచి సెప్టెంబర్ వరకు వర్షాల ప్రభావం ఉంటుంది. దీంతో జ్వరాలు కూడా విస్తరిస్తాయి. ప్రతి ఏడాది జ్వరాలతో చాలా మంది ఆసుపత్రుల పాలవడంతో పాటు డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో భాదపడుతూ మృతి చెందుతున్న విషయం తెలిసిందే. ఆసుపత్రులు కూడా ఇదే సీజన్‌లో కిటకిటలాడుతుండటం ఐదారేళ్లుగా చూస్తూనే ఉన్నాం. వ్యాధుల బారి నుంచి బయట పడటానికి ప్రజలు కూడా వేలకు వేలు ప్రైవేటు ఆసుపత్రులకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ పరిస్థితులన్నీ రాకుండా కొంతలో కొంత జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు ఉండవు. ముఖ్యంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గున్యా మెదడువాపు తదితర వైరల్ ఫీవర్లతో పాటు డయేరియా కూడా ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది. ఏటా ప్రజలకు జ్వరాల అల్లకల్లోలం చేస్తూనే ఉన్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు కూడా ప్రజలను చైతన్యం చేస్తే కొంత ప్రయోజనం ఉంటుంది.

ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం



సీజన్ ప్రారంభమయిన దృష్ట్యా వ్యాధులు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాము. వైరల్ ఫీవర్, మలేరియా, డయేరియా వంటి వ్యాధులకు మందులను అందుబాటులో ఉంచుతున్నాం. అలాగే ప్రజలు కూడా వర్షాకాలం ప్రారంభంలో తాగు నీటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకునేలా వారిని చైతన్యం చేసేందుకు కార్యక్రమాలు చేపట్టి ఎటువంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటాం.

– డాక్టర్ ఎస్.ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'మొంగం'



మొంగం అమృతరావు

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పీఆర్టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామచంద్రపురం మండలం చోడవరం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మొంగం అమృతరావు నియమితులయ్యారు. ఈ మేరకు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గిరి ప్రసాద్‌ల నుంచి సోమవారం రాత్రి ఉత్తర్వులు అందినట్లు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, పీఆర్టీయూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ నియామకంపై ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

భీమేశ్వరాలయ మూల విరాట్ సంరక్షణ పనుల పొడిగింపు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ ఏడాది ఏప్రిల్ 24న ప్రారంభించిన మూల విరాట్ మరమ్మతులు ఈ నెల 15 వరకు పొడిగించినట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 30వ తేదీ వరకు పనులు చేయాలని ముందుగా ప్రణాళిక వేసుకున్నారన్నారు. అయితే మంగళవారం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సీనియర్ కన్సర్వేషన్ అసిస్టెంట్ మంగళవారం పనులను పరిశీలించి దేవాలయ పరిరక్షణ, సంరక్షణ పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నందున ఈ నెల 15 వరకు ప్రస్తుతం నిర్వహిస్తున్న బాలాలయం నందు స్వామి, అమ్మవార్ల దర్శనాలు కొనసాగించాలని లేఖను అందజేశారన్నారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

కాజులూరు: ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కౌలురైతు సంఘం నాయకులు పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాజులూరులో రాజబాబు తదితరులు మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా ధాన్యం అమ్మకాలు చేస్తే మంచి గిట్టుబాటు ధర వస్తుందని రైతులు ఆర్బీకేల ద్వారా అమ్మకాలు చేవారన్నారు. అయితే రెండు నెలలు కావస్తున్నా ధాన్యం సొమ్ములు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల గ్రామాల్లో కోటి యాభై లక్షల వరకూ ధాన్యం బకాయిలు ఉన్నాయని తొలకరి సాగు పెట్టుబడులు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం త్వరితగతిని రైతులకు ధాన్యం సొమ్ములు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు బుడితి ప్రభాకరరావు, నాగేశ్వరరావు, కురుపూడి భూచక్రం పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌కు వీడ్కోలు సన్మానం

మండపేట: స్థానిక పురపాలక సంఘం పరిధిలో సుదీర్ఘకాలం టర్న్‌కాక్‌గా విధులు నిర్వహించిన గెడ్డం విజయ్‌కుమార్ రిటైరయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పదవీ విరమణ సభలో విజయ్‌కుమార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కమిషనర్ బొడ్డేపల్లి రాము దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పీఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, డీఈఈ కె.శ్రీనివాస్, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడి రామారావు, యర్రగుంట అయ్యప్ప, మున్సిపల్ సిబ్బంది అశోక్, తాతారావు, యేలేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోండి

మండపేట: నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దూలి జయరాజు కోరారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్లను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఛిద్రమైన పలు రోడ్ల దుస్థితి గురించి జయరాజు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పెందుర్తి ప్రదీప్‌కుమార్, మోరంపూడి సుబ్రహ్మణ్యం, ముమ్మిడివరపు నారాయణ, రాయి దొరబాబు, పైడిమళ్ల సతీష్, గాలింకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: డయేరియా విస్తరిస్తున్న నేపథ్యంలో వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అంగర పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య కార్యకర్తలు, పడమర ఖండ్రిక సచివాలయ ఉద్యోగులు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు డాక్టర్ రత్నకుమారి తెలిపారు.

4న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి



దేశ వ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల చేస్తున్న సిద్ధూ తదితరులు

రామచంద్రపురం: ఈనెల 4న చేపట్టిన దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పిలుపునిచ్చారు. స్థానిక కృతివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను సిద్ధూ విడుదల చేశారు. సిద్ధూ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాసాలతో, బాధ్యతా రాహిత్యంతో పరీక్షలు నిర్వహించారన్నారు. నీట్ పరీక్ష లీకేజీ తెరవెనుక కుంభకోణం, నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా ఈనెల 4న దేశ వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థల బంద్‌కు ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపునివ్వడం జరిగిందని అన్నీ విద్యా సంస్థల యాజమాన్యాల బంద్‌కు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు డి.హరీష్, ఎం.రాజేష్, ఆర్.భాను ప్రకాష్, వి.నాగదుర్గా హనుమాన్, జి.తరుణ్ సాయి, అభిలాష్ తదితరుల పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై 'బాబు' నోరెత్తరేం?

మండపేట: దేశంలోని అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తుంటే, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎందుకు నోరు మెదపడం లేదని ఏఐసీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ప్రశ్నించారు. స్థానిక ఏడిద రోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ నెరవేర్చాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించారని కామన గుర్తు చేశారు. హోదా రాకపోతే ఎన్డీయే కూటమి నుంచి బయటకు వస్తామని కూడా నితీష్ హెచ్చరించారన్నారు. అదే అంశంపై ఇప్పటి వరకూ మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. ఎన్డీయే కూటమిలో చంద్రబాబు నాయుడు కీలకమని, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ రాష్ట్రానికి హోదా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మన రాష్ట్ర ఎంపీల అవసరం మోదీకి ఉన్నందున చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు రాష్ట్రంలోని అందరి ఎమ్మెల్యేల మద్దతుతో మోదీకి అల్టిమేటం ఇవ్వాలని కామన డిమాండ్ చేశారు.

కొలిక్కి రాని సరిహద్దు ఆస్తుల పంపకం



చొప్పెల్లలో జరుగుతున్న చెముడులంక-చొప్పెల్ల సరిహద్దు సమస్యపై ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న గ్రామపెద్దలు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, చెముడులంక గ్రామాల మధ్య గత మూడు దశాబ్దాలుగా జరుగుతున్న సరిహద్దుల ఆస్తి పంపకాల వివాదంపై మంగళవారం జరిపిన చర్చల్లో ఎటువంటి పురోగతి కనిపించలేదు. వివరాల్లోకి వెళితే 1995లో చొప్పెల్ల గ్రామపంచాయతీ నుంచి చెముడులంక విడిపోయి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. అప్పటి జిల్లా కలెక్టర్ ఒకటి నుంచి 74వ సర్వే నంబర్ వరకు గల ఆస్తులను చెముడులంక పంచాయతీకి, 75 నుంచి తుది సర్వే నంబరు వరకు చొప్పెల్ల పంచాయతీకి కేటాయించారు. చొప్పెల్లకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ముఖ్యమైన ప్రదేశాలు చెముడులంక పంచాయతీలోకి చేరాయి. దీంతో పాటు 1500 మంది జనాభా కూడా అదే పంచాయతీలో చేర్చాల్సి వచ్చింది. అప్పట్లో ఈ విభజన వల్ల చొప్పెల్ల గ్రామ పంచాయతీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆ గ్రామస్తులు నిరసన తెలియజేశారు. ఒకటి నుంచి 27 సర్వే నంబర్ వరకు గల ఆస్తులను మాత్రమే చెముడులంకకు విలీనం చేయాలని అప్పటి చొప్పెల్ల సర్పంచ్ దంగేటి పెద్ద సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఈ వివాదం పరిష్కారం కాకుండా తాత్కాలికంగా బ్రేక్ పడింది.

అప్పటి ఆదేశాలు అమలు చేయాలి

చెముడులంక గ్రామ సర్పంచ్ తమ్మన శ్రీనివాసు మళ్లీ 1995లో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించడంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. జిల్లాల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపేట ఆర్డీఓ ఆర్‌వీవీ సత్యనారాయణ నేతృత్వంలో డీఎల్పీఓ ఏ రాజు, తహసీల్దార్ డీవీఎస్ రాజ్ కుమార్‌తో కూడిన అధికారుల బృందం మంగళవారం ఆ రెండు గ్రామాల్లో పర్యటించి గ్రామ సరిహద్దులను పరిశీలించింది. అనంతరం చొప్పెల్ల పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, దంగేటి చంద్రకళ నేతృత్వంలో ఇరు గ్రామాల పెద్దల సమక్షంలో సమస్యపై చర్చించారు. ఇరు గ్రామాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఈ సరిహద్దు సమస్యలపై మరింత లోతుగా అధ్యయనం చేసి తుది నిర్ణయం తీసుకుంటామని ఆర్డీఓ సత్యనారాయణ హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు మెర్ల గోపాలస్వామి, ఆకుల రామకృష్ణ, దంగేటి బాపనయ్య, నయనాల శ్రీరామ చంద్రమూర్తి, తమ్మన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ అభ్యంతరాలతో రూ.20 వేల రికవరీ



మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న అధికారులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో 2023–2024 సంవత్సరానికి సంబంధించి సోషల్ ఆడిట్ అభ్యంతరాలు తెలియజేయండంతో క్షేత్ర సాయి సిబ్బంది నుంచి రూ.20 వేలు నగదు రికవరీ చేసినట్టు ద్వామా పీడీ ఎస్.మధుసూదనరావు తెలిపారు. మంగళవారం 2023–24కి సంబంధించి సామాజిక తనిఖీ నివేదికలను ఎస్ఆర్పీ కనకరావు, డీఆర్పీలు చదివి వినిపించారు. అయితే ఆర్థిక సంవత్సరానికి ఉపాధి కూలీలకు వేతనం ద్వారా రూ.8.47 కోట్లు చెల్లించామన్నారు. అలాగే మెటీరియల్ నిమిత్తం రూ.2.09 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అయితే గ్రామాల్లో మొక్కలు నాటినట్లు చూపించారన్నారు. అక్కడ మొక్కలు నాటిన ఆనవాళ్లు లేవని, అలాగే పంట బోదెలు తవ్విన ఆనవాళ్లు లేవన్నారు. వీటికి మాత్రం వేతనాలు చెల్లించినట్లు రికార్డు చేసినట్లు తెలిపారు. మస్టర్లల్లో సంతకాలు, వేలిముద్రలు లేకపోవడం, కూడికల్లో తేడాలు, రుద్దివేతలు ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. రైతులు కొబ్బరి తోటల్లో అంతరపంటల సాగుకు, వాటి మెయింటెనెన్స్‌కు ఉపాధి హామీలో నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వరరావు, అంబుడ్స్‌పర్సన్ ఎ.శ్రీనివాసరావు, ఏపీడీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి శస్త్ర చికిత్సకు రూ.75 వేల సాయం



వెదిరేశ్వరంలో అఖిల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: మండలంలోని వెదిరేశ్వరం గ్రామ శివారు మూలగూడెంకు చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల ఐదు నెలల చిన్నారి అఖిల్‌కు లివర్ మార్పిడి శస్త్ర చికిత్స అవసరమైంది. ఈ శస్త్ర చికిత్సకు రూ.25 లక్షల వరకూ వ్యయం అవుతుందని కార్పొరేట్ వైద్యులు తెలిపారన్నారు. డ్రైవర్‌గా జీవనం సాగించే తండ్రికి అంత స్తోమత లేకపోవడంతో సాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ తమ సభ్యుల సహకారంతో రూ.75 వేలు నగదును మంగళవారం అఖిల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

పుడమి తల్లికి పచ్చ బొట్లు

- నియోజకవర్గంలో వేగంగా ఖరీఫ్ సాగు
- విస్తారంగా వర్షాలు
- వరినాట్లు ముమ్మరం



కె.గంగవరంలో కనుచూపుమేర వరినాట్లతో పచ్చదనంతో నిండిన పొలాలు




తామరపల్లిలో దమ్ము చేస్తున్న రైతు

కె.గంగవరం: నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు వర్షాలు అంతంతమాత్రం పడినా రైతులను మాత్రం నిరాశపరిచింది. అయితే గత వారం రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తొలకరి పనులు రైతులు ముమ్మరం చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటి వరకు 30 శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువులు, కాలువలు, పంట బోదెలు, ఊటకాలువలు వర్షపు నీటితో నిండిపోయాయి. కోటిపల్లిలోని ప్రధాన కాలువ, కె.గంగవరంలోని టీకి డ్రెయిన్, పామర్రులోని రాజు కాలువలు నీటి ప్రవాహంతో కళకళలాడుతూ ప్రవహిస్తున్నాయి. వర్షాలు పూర్తి స్థాయిలో కురవడం వల్ల నాట్లు పెరిగి పుడిమి తల్లికి పచ్చబొట్లు వేసిన విధంగా పచ్చదనంతో పంట పొలాలు ఆహ్లాదంగా మారాయి. కాలువలకు నీరు రావడం, వర్షాలు ప్రారంభం కావడంతో వరినాట్లు మరింత ఊపు అందుకున్నాయి. ఈ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎండ తాకిడితో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఈ నెల మొదట్లోని కాలువకు నీరు వచ్చినా వర్షం లేకపోవడంతో సాగు కొంత మేర ఆలస్యమయింది. దీంతో కేవలం రైతులు నారుమడులు వేయడంతోనే సరిపుచ్చుకున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ఎక్కువ శాతం రైతులు వరినే పండిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలో 4200 హెక్టార్లు, కాజులూరులో 4500హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 5046 హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారు.

బెంగాలీ కూలీలతోనే..

వర్షాలు అధికంగా కురుస్తుండడంతో రైతులు అందరూ ఒక్కసారిగా నాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నారు. వీరంతా ఎక్కువగా బెంగాలీ కూలీలపై ఆధార పడుతున్నారు. నాట్లు వేయడానికి ఖర్చు తక్కువగా అవడం, వేగంగా నాట్లు వేయడం పాటు ఎకరానికి ఉపయోగించే నారు తక్కువగా ఉండడంతో రైతులు ఎక్కువ భాగంగా బెంగాలీ కూలీలపై ఆధారపడుతున్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా అధిక దిగుబడులు నిచ్చే వరి వంగడాలైన ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాల సాగుపైనే మక్కువ చూపిస్తున్నారు. మరో 20 రోజుల్లో వరి నాట్లు పూర్తి కావచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వేగంగా వరి నాట్లు పూర్తి చేసుకోవాలని రైతులు కూడా వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు.

వేగంగా వరినాట్లు పూర్తి చేయాలి



వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రైతులు వరినాట్లు వేగంగా పూర్తి చేస్తే దిగుబడి అధికంగా ఉంటుంది. ఇప్పటికే ఈ సీజన్ కొంత వరకు ఆలస్యం అయింది. రైతులు వరినాట్లు వేయడం మరింత తొందరగా చేయాలి.

– బలుసు రవి, ఏవో, కె.గంగవరం